# 11

# “ఈలాగు ... ప్రార్థించుడి”

## (మత్తయి 6:9-15; లూకా 11:1-4)

“మనుష్యులకు కనబడులాగున” (1 వచనం) మనం నీతి కార్యములను చేయడం గురించి మత్తయి 6వ అధ్యాయంలో యేసు హెచ్చరిస్తున్నారు. యిందుకోసం ఆయన మూడు ఉదాహరణలను యిచ్చారు: పేదలకు సహాయం చేయడం (2–4 వచనాలు), ప్రార్థించడం (5–15 వచనాలు), మరియు ఉపవాసం (16–18 వచనాలు). ప్రార్థనను గురించిన వివరణలో మనకు “పరలోక ప్రార్థన” (9–15 వచనాలు) యియ్యబడింది. దీని నుండి మనం నేర్చుకొనవలసినది ఎంతో ఉన్నది. కాబట్టి దీనికి ప్రత్యేకంగా ఒక పాఠమును కేటాయించాము.[1] ఈ ప్రార్థన అనేకమందికి సుపరిచితమే:

“కాబట్టి మీరీలాగు[2] ప్రార్థన చేయుడి,
పరలోకమందున్న మా తండ్రీ,
నీ నామము పరిశుద్ధ పరచబడును గాక;
నీ రాజ్యము వచ్చును గాక;
నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక,
మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము.
మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము.
మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి తప్పించుము.
రాజ్యము, బలము, మహిమ, నిరంతరము నీవైయున్నవి, ఆమేన్! (5–13 వచనాలు).

మరియొక సందర్భంలో, ఆయన ఒకచోట ప్రార్థన చేయుచుండెను, “ప్రార్థన చాలించిన తరువాత ఆయన శిష్యులలో ఒకడు, ప్రభువా, యోహాను తన శిష్యులకు నేర్పినట్టుగా మాకును ప్రార్థన చేయ నేర్పుమని ఆయననడిగెను” (లూకా 11:1). ఇందుకు ప్రతిస్పందనగా యేసు ఈ చిన్న ప్రార్థనను నేర్పిస్తున్నారు:

... మీరు ప్రార్థన చేయునప్పుడు,
“తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడును గాక
నీ రాజ్యము వచ్చునుగాక, మాకు కావలసిన అనుదినాహారము
దినదినము మాకు దయచేయుము;
మేము మాకచ్చియున్న ప్రతి వానిని క్షమించుచున్నాము గనుక మా పాపములను
క్షమించుము; మమ్మును శోధనలోకి తేకుము (లూకా 11:2–4).

మత్తయి 6వ అధ్యాయంలో యివ్వబడిన ప్రార్థన మీదనే మన అధ్యయనం కేంద్రీకృతమైయుంటుంది. కాని అప్పుడప్పుడు లూకా 11వ అధ్యాయాన్ని కూడ పరిశీలిస్తుంటాము. ప్రార్థనను మనం అధ్యయనం చేయక ముందు రెండు విషయాలను మీ ముందుంచాలనుకుంటున్నాను. మొదటిది, మత్తయి 6లో ఇవ్వబడిన ప్రార్థన, ఆచారము నిమిత్తము ఇయ్యబడినది కాదు. మత్తయి 6:9–15 వాక్య భాగమునకు ముందు “వ్యర్థమైన

మాటలను ఉచ్చరింపవద్దని" (7 వచనం) యేసు హెచ్చరిస్తున్నారు. తరువాత, "మీరు ఈలాగు ప్రార్థన చేయాలి" (9 వచం) లేదా "ఈలాగు చేయండి" "ఈ మాటలను" వల్లించకుండ ప్రార్థించండి (KJV) అని ప్రభువు చెప్పుతున్నారు. LB వ్యాఖ్యానంలో "ఈ విధంగా ప్రార్థించుడి" అని ఉంది. తరువాత సమయంలో (లూకా 11) ప్రార్థన గురించి ప్రభువు తెలియజేస్తూ యివే మాటలను ఆయన పునరుచ్చరించలేదు. మత్తయి 6వ[3] అధ్యాయంలో ఆయన 68 పదాలను (ఆంగ్లంలో) ఉపయోగించాడు. లూకా 11లో[4] కేవలం 37 పదాలను ఉపయోగించారు.

రెండవదిగా, ఈ ప్రార్థనను "ప్రభువు ప్రార్థన" అన్న శీర్షిక దీనికి అంతగా సరిపోతున్నట్లు ఉండదు. చాలా కాలం క్రితం ఎవరో ఒక వేదాంతవేత్త దీనికి ఈ పేరును యిచ్చారు, అప్పటినుండి అదే పేరుతో చలామణి అవుతుంది. ఈ ప్రార్థనను ఆయన వ్యక్తిగతంగా చేసినట్లు ఎక్కడా కనబడదు.[5] దీనికి "శిష్యుల ప్రార్థన" అన్న శీర్షిక సరిగ్గాయుంటుంది. అయితే, "మాదిరి ప్రార్థన" అన్న శీర్షిక నాకు యిష్టమైనది.

ప్రార్థన అనేక విధాలుగా మనకు మాదిరిగా ఉంటుంది. యిది ప్రార్థనా ఉద్దేశమునకు మాదిరిగా ఉంటుంది. యిందులో దేవుని యొక్క గొప్పతనాన్ని చూడగలం. యిది పరలోక రాజ్యము గురించి మరియు ఈ లోకంలోని ప్రజల గురించిన అక్కరను తెలియజేస్తుంది. యిది మన వ్యక్తిగత అవసరతలను స్పర్శిస్తుంది, *సంక్షిప్తతకు, సామాన్యతకు* ఈ ప్రార్థన మాదిరిగా ఉంటుంది. మత్తయిలోని ఐదు వచనాల్లో, లూకాలోని మూడు వచనాల్లో యిది నిక్షిప్తమైయుంది. అయితే మత్తయిలోని ఈ ప్రార్థన దీర్ఘరూపాన్ని బిగ్గరగా చదవడానికి కేవలం ఇరవై సెకన్లల సమయం పడుతుంది. యితర విషయాల్లో కూడ యిది మాదిరికరంగా ఉంటుంది.

## గమనంలో ఒక మాదిరి (6:9)

ఉదాహరణకు, దీని యొక్క దిశ, గమనంలో ఈ ప్రార్థన మాదిరిగా ఉంటుంది. మొదటిగా, యిది దేవుని వైపు సూచిస్తుంది. "పరలోకమందున్న *మా తండ్రీ*" (9 వచనం). ఇది మరియమ్మను లేక వేరే పునీతులను ఉద్దేశించి గాక దేవుని ఉద్దేశించుచున్నది. "మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట సమస్తమును గూర్చి *తండ్రియైన దేవునికి* ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" (ఎఫెసీయులకు 5:20) అని పౌలు వ్రాస్తున్నాడు. *మన తండ్రియైన దేవునికి* మనం ప్రార్థించాలి. ఆయన వ్యక్తిగతమైన దేవుడు, మనలను పోషించి మన గురించి శ్రద్ధ వహించే తండ్రి ఆయన. మనం చేసే ప్రార్థన మన తండ్రిని ఉద్దేశించినది. యిది సన్యాసులు చేసే తపస్సును కాదు. ఏక పుత్రలముగా చేసే విన్నపం కాదు. యిది "మా తండ్రి" అనే పదం మన మధ్యనున్న సాధారణ సహోదరత్వమును సూచిస్తుంది. "మా తండ్రి" అని మనం ప్రార్థన చేస్తున్నప్పుడు మనమందరం కలసి ఏకముగా మన కుటుంబ విషయాలను మన తండ్రితో చర్చిస్తున్నాం.

ఈ ప్రార్థన తన యొక్క గమనంలోనూ మాదిరికరంగా ఉంటుంది. ఎందుకంటె, యిది పరలోక గమనాన్ని సూచిస్తుంది: "పరలోమందున్న మా తండ్రీ." ఈ లోకము దేవుని యొక్క సృష్టి మరియు యిది ఆయనకు చెందినది, కాని యిది ఆయన గృహం కాదు. మన ధర్మము పరలోక కేంద్రీకృతమైనది. ప్రభువు పరలోకంనుండి వచ్చాడు తిరిగి ఆయన అక్కడికే

వెళ్ళాడు. ఆయనిప్పుడు పరలోకంలో తండ్రి కుడిపార్శ్వమున ఉన్నాడు. అక్కడినుండి మనకొరకు విజ్ఞాపన చేస్తున్నాడు. ఒక రోజున పరలోకంనుండి ఆయన వచ్చి, తన వారిని సమకూర్చుతారు. ఆయన వారందరూ నిత్యత్వములో ఆయనతో కూడ పరలోకంలోనుండి ఆనందిస్తారు. "మన పౌరసత్వము పరలోకంలోనున్నది" అని పౌలు ఫిలిప్పీయులకు 3:20లో తెలియజేస్తున్నాడు. "మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని" యేసు శిష్యులకు తెలియజేశాడు (లూకా 10:20). అలాగే "పరలోకంలో మీ నిధులను సమకూర్చుకొనండి" అని ఆయన చెప్పారు (మత్తయి 6:20).

## భక్తియందు మాదిరి (6:9)

భక్తియందలి మాదిరితనాన్ని ఈ ప్రార్థన సూచిస్తుంది. దేవుడు మన స్నేహితుడు కాదు. ఆయన మన తండ్రి. ఆయన నామము పరిశుద్ధమైనది. అందుకనే "నీ నామము పరిశుద్ధ పరచబడును గాక!" (9సి వచనం; లూకా 11:2 చూడు) అన్న ప్రార్థన ఇయ్య బడింది. "పరిశుద్ధ పరచబడడం" (*hagiaza*) అను మాట "పరిశుద్ధ" (*hagios*) అను గ్రీకు పదంనుండి వచ్చింది. "పరిశుద్ధముగా ఎంచి భక్తిచేయడం" అని దీనికి అర్థం.[6] "ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపదగినది" (కీర్తనలు 111:9) అని పాత నిబంధనలో కీర్తనాకారుడు తెలియజేస్తున్నాడు. యిదే రీతిలో "నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు" (నిర్గమకాండము 20:7ఎ) అని మోషే ఆజ్ఞాపిస్తున్నాడు.

దేవుని యొక్క నామము ఆయన గురించి తెలియజేస్తుంది. "దేవుని నామమును ఉచ్చరించునప్పుడు మనం మన పాదరక్షలను తీసివేయుట మన కనీస జ్ఞానాన్ని సూచిస్తుంది"[7] అని డి. మార్టిన్ లాయిడ్ జోన్స్ వ్రాస్తున్నాడు. నూతన నిబంధనలోని ప్రజలమైన కూడ దేవుని సన్నిధిని భక్తితో, భయముతో, పరిశుద్ధముగా మనముండవలెనని ఈ మాదిరి ప్రార్థన తెలియజేస్తుంది.

## నొక్కి చెప్పుటయందు మాదిరి (6:10)

యింతకు ముందు చెప్పబడిన భక్తి, గౌరవం ప్రార్థనలో మన మనవులను చేయుటలో సహాయపడుతుంది. యిందులో మొదటి విషయం మన గురించి గాక, దేవుని ప్రణాళిక మరియు చిత్తమును గురించినది. "నీ రాజ్యము వచ్చునుగాక" (10 వచనం; లూకా 11:2సి చూడు). యిక్కడ "రాజ్యము" (*basileia*) అను పదం "సార్వభౌమత్వము, రాజరికము, అధికారమును" సూచిస్తుంది. ప్రాథమికార్థములో చెప్పాలంటే "యిది ఒక రాజ్యము లేదా ఒక రాజు పరిపాలించు ప్రాంతాన్ని సూచిస్తుంది."[8] దేవుని రాజ్య పరిపాలనను సూచిస్తుంది. "నీ రాజ్యము వచ్చునుగాక!" అనే మాటకు "అనేకమంది ప్రజలు తమ జీవితాలలో మరియు హృదయాలలో దేవుని రాజుగా ప్రతిష్ఠించుకొనునుగాక!" అని అర్థం అంటారు. ఈ అర్థం ప్రకారం, ఈ ప్రార్థనలోని తరువాతి మనవి కూడ సమనానార్థాన్నిస్తుంది. "నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక" (10 వచనం).

కొండమీది ప్రసంగం యొక్క నేపథ్యాన్ని మరువకండి. ఈ ప్రసంగానికి కొంచెం ముందు "పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడి" (4:17) అని గలలియ ప్రాంతములలో ప్రభువు ప్రకటించారు. ఈ "రాజ్యము" మెస్సీయా రాజ్యము. దీని

కొరకు యూదులు ఎదురు చూస్తూ ఉన్నారు. ఈ రాజ్యము క్రీస్తు మృతిపొంది, సమాధి చేయబడి, పునరుత్థానుడైన తరువాత వచ్చిన మొదటి పెంతెకొస్తు దినమున స్థాపించబడింది. పత్రికలలో యిది "సంఘముగా" పిలువబడింది. మెస్సీయా రాజ్యము గురించి కొన్ని ప్రాముఖ్య వాక్య భాగాలను పరిశీలించండి:

- రోమీయుల కాలములలోనే మెస్సీయా యొక్క రాజ్యము వస్తుందని దానియేలు ప్రవచించాడు (దానియేలు 2:44 చూడు).[9]
- రోమీయులు ప్రపంచాన్ని పరిపాలిస్తున్నప్పుడు బాప్తిస్మమిచ్చు యోహాను మరియు యేసు "పరలోక రాజ్యము సమీపించియున్నది" (మత్తయి 3:2; 4:17) అని ప్రకటించారు.
- కైసరుదైన ఫిలిప్పియలో ప్రభువు ప్రకటిస్తూ, తన రాజ్యము స్థాపించబడుచున్నదని, అది తన సంఘమని చెప్పారు (మత్తయి 16:18, 19).
- దేవుని రాజ్యము శక్తిని వచ్చుట చూస్తారని (మార్కు 9:1) ప్రభువు తన శిష్యులతో చెప్పారు. పరిశుద్ధాత్ముడు వచ్చినప్పుడు శక్తిని పొందుతారు అని ప్రభువు మరో సందర్భంలో చెప్పారు (అపొస్తలుల కార్యములు 1:6–8).
- యేసు క్రీస్తు మృతినొంది సమాధి చేయబడి పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ క్రుమ్మరింపు జరిగింది (అపొస్తలుల కార్యములు 2:1–4). శక్తి పొందిన తరువాత సంఘం స్థాపించబడింది.

పెంతెకొస్తు దినము తరువాత రాజ్యము/సంఘము ఉనికిలోకి వచ్చిందని చెప్పబడింది. దేవుడు ప్రజలను రక్షించినప్పుడు "చీకటి రాజ్యము"నుండి వారిని రక్షించి తన ప్రియకుమారుని రాజ్యములోనికి వారిని తీసుకు వచ్చి (కొలొస్సయులకు 1:13) తన సంఘములోనికి వారిని చేర్చుతాడు (అపొస్తలుల కార్యములు 2:47 చూడు). క్రైస్తవులున్న ఈ రాజ్యము ఎన్నడూ కదల్చబడదు (హెబ్రీయులకు 12:28), పాతాళ ద్వారములు దీని యెదుట నిలబడలేవు (మత్తయి 16:18)!

"నీ రాజ్యము వచ్చును గాక!" అని శిష్యులు ప్రార్థిస్తున్నప్పుడు, దేవుని యొక్క నిత్య ప్రణాళిక అయిన సంఘంలో వారు భాగస్వాములు కావలెనని ప్రభువు ఆశిస్తున్నాడు (ఎఫెసీయులకు 3:10, 11 చూడు).

నేడు మన ప్రార్థనలలో ఈ భాగాన్ని చేర్చవచ్చా? యిందును గురించి జె. డబ్ల్యూ. మెక్‌గార్వ్ యిలా వ్రాస్తున్నాడు, "మనం వేడుకుంటున్న రాజ్యము యిదివరకే మన మధ్యకు వచ్చియున్నది గనుక 'నీ రాజ్యము వచ్చును గాక;' అన్న మనవిని మనం తప్పనిసరిగా యిందులోంచి తప్పించలసిందే. వాటిని యింకా వల్లించడం సబబు కాదు. అయితే ప్రభువు ఉద్దేశించిన భావము గాక మరో అర్థములో ఈ మాటలను ఉపయోగించుదాం."[10] ఈ మాటలను మరియొక భావముతో వాడుకొనవచ్చును, "నీ రాజ్యము ప్రపంచ పలుమూలలకు వచ్చును గాక!" అని లేదా "నీ రాజ్యము మనుష్యులందరి హృదయాలలోకి వచ్చును గాక!" అని ప్రార్థిద్దాము. ఒకవేళ మనమీ మాటలను ఈ భావముతో గాక యథాలాపంగా ప్రార్థించినట్టయితే, క్రీస్తు యొక్క రాజ్యం యింకనూ స్థాపింపబడలేదన్న ప్రిమిల్లేనీయుల వాదనకు బలమును చేకూర్చిన వారమవుతాము.

మన యొక్క దైనందిన ప్రార్థనలలో రాజ్యము యొక్క క్షేమము గురించి ప్రార్థిస్తూ రాజ్యము/సంఘం *గురించిన* ఆలోచన కలిగిన వారమైయుండాలని యేసు మాదిరికర ప్రార్థన బోధిస్తుంది. మన స్థానిక మరియు సార్వత్రిక సంఘం గురించి మనం ప్రార్థించాలి. యిలా చేయుట ద్వారా సంఘము ద్వారా "దేవుని యొక్క నానావిధమైన జ్ఞానమును తెలియజేయబడవలెనని దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్య సంకల్పములో" మనమందరమూ పాలివారమగుతున్నాము (ఎఫెసీయులకు 3:10, 11).

## శ్రద్ధయందు మాదిరి (6:10)

ప్రార్థనలోని తరువాయి భాగంకూడ ఆత్మీయతపైనే నొక్కి చెబుతుంది: "నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక" (10 వచనం). భూమి మీదనున్న ప్రతి వ్యక్తి కూడ దేవుని చిత్తానికి లోబడియుండాలన్న దేవుని ఆకాంక్ష యిక్కడ చెప్పబడియుంది. ఈ ఆలోచన కూడ మన మనసులలో సంశయతను నెలకొనేలా చేస్తుంది. పరలోక రాజ్యంలో దేవుని మాట ఎలా నెరవేరుతుందో గమనించండి. దేవుని సింహాసనం ఎదుట దేవదూతలు, ప్రధాన దూతలు నిలువబడియున్నట్లు ఊహించండి. దేవుని యొక్క ఆజ్ఞలను వినుటకు, వాటిని చేయుటకును వారు ఎంత ఆసక్తిగా ఉంటారో గమనించండి. యిదేవిధంగా, భూమి మీదనున్న వారు కూడ దేవుని చిత్తం నెరవేర్చుటలో త్వరపడుతున్నట్లయితే, దేవుని చిత్తము ఆయన వాక్యంలో తెలియజేయబడియున్నది. కాబట్టి ప్రార్థనలోని ఈ భాగం నెరవేర్చబడడానికి, వాక్యమును ఈ లోకమందంతట మనము ప్రచూరము చేయాలి (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16). లోకంలోని ప్రజలందరిని ఆ వాక్యంలోనున్న దేవుని ఆజ్ఞలకు వారు లోబడేలా వారిని ప్రోత్సహించాలి.

దేవుని చిత్తం పట్ల మన వైఖరి ఎలా ఉందో మనలను మనం పరీక్షంచుకొనేలా ప్రార్థనలోని ఈ అంశం దోహదపడుతుంది. దేవుని చిత్తం పట్ల అనేకమంది అసంతృప్తిగా ఉంటారు. "పరలోకపు రాజు తమ జీవితాలలో అందించిన కొన్ని ఉపకారాలు, ఉపకరణాల పై కొందరు అసంతృప్తిగా ఉంటారు" అని చెప్పబడింది. కొంతమంది యిందుకు భిన్నంగా "తమ చిత్తం భూమి మీద జరుగునుగాక!" అని అనుకుంటుంటారు. ఈ విషయం పై విలియం బార్‌క్లే యిలా వ్రాస్తున్నాడు, "మన ఆశకు అనుగుణంగా దేవుని చిత్తాన్ని మలుచుకునేందుకు కొంతమంది ప్రార్థనను వాడుకుందామనుకుంటారు, దేవుని చిత్తానికి అనుగుణంగా మన చిత్తాన్ని మలుచుకునేందుకు మనం చేసేది ప్రార్థన."[11]

## నిర్బంధము యందు మాదిరి (6:11)

మనం మాదిరి ప్రార్థనలో సగం వరకు వచ్చినా గాని, యింతవరకు వ్యక్తిగత మనవులు చేయబడలేదు. దీనిని బట్టి మన ప్రార్థనలో ఏం చేయాలో, ఏం ఉండాలో మనకు అవగతమవుతుంది. అయితే, యిప్పుడు మన వ్యక్తిగత విన్నపమును దేవుని సన్నిధిలో పెట్టే సమయం వచ్చింది. ఈ భాగంలో "మా అనుదినాహారము[12] నేడు మాకు దయచేయుము" (11 వచం) అని చూస్తాం. మాకు కావలసిన అనుదినాహారము *దినదినము* మాకు దయచేయుము (లూకా 11:3) అని లూకా వ్రాస్తున్నాడు. ఈ ప్రార్థనలోని నిర్బంధమును గుర్తించండి. ఈ విన్నపము కేకు లేదా మరో రుచికరమైన విందు[13] కోసరము కాదు గాని కేవలం కనీస

ఆహారం కోసం మాత్రమే. యిది నెలరోజుల ఆహారం కోసం కాదు గాని దిన ఆహారం కోసం మాత్రమే. "మన అవసరతల కోసం ప్రార్థన చేయాలి గాని, దురాశల కోసం కాదు."[14]

జీవిత అవసరతల విషయములో మనం సంతృప్తి కలిగియుండాలనేది ఈ ప్రార్థనలోని అనేక పాఠాలలో ఒకటైయుంది. ఆహారం మనకు ప్రాథమిక అవసరత. యితర విషయాన్ని అడగడం తప్పు కాదు. "అన్న వస్త్రములు గలవారమైయుండి వాటితో తృప్తి పొందుదుము" (1 తిమోతి 6:8) అని పౌలు వ్రాస్తున్నాడు.

ప్రార్థనలోని ఈ విభాగంలో మరికొన్ని యితర పాఠములను నేర్చుకుంటాము. ఉదాహరణకు, మన ఆశీర్వాదములకు దేవుడే ఆధారమని మనం నేర్చుకుంటాం. స్వల్ప మాత్రమైనా గాని, మన కనీస అవసరత అయిన ఆహారం కొరకు దేవున్ని మనం అడగాలి. "నేను ఏం చేశానో చూడు" అని గాకుండా దేవుడు నా "విషయంలో ఏం చేశాడో చూడు" అని చెప్పడం మనం నేర్చుకోవాలి. మనం దేన్నయితే పొందుతుంటున్నామో, దానిని దేవుడు మన కొరకు అక్కడ ఉంచియున్నాడని ఎరిగి ప్రతిదాని విషయమై దేవుని స్తుతించాలి. మన దినవారీ ఆహారం కొరకు మనం కష్టపడాలి (2 థెస్సలొనీకయులకు 3:11 చూడు), కాని ఆ ఆశీర్వాదం మన దగ్గరకు రావడానికి దాని కారణభూతుడయిన దేవున్ని మనం గుర్తించాలి:

> రొట్టె చేయుటకు ముందు పిండి కావాలి
>    పిండి చేయుటకు ముందు మిల్లు ఉండాలి;
> మిల్లుకు ముందు గోధుమలు కావాలి
>    యిది మొలవడానికి వర్షం, సూర్యుడు, తండ్రి చిత్తం ఉండాలి.[15]

మనం స్వార్థ ప్రియులు కాకుండవలెనన్న సందేశాన్ని 11వ వచనం యిస్తుంది. "నా అనుదిన ఆహారం" అని కాక "మా అనుదిన ఆహారం" అని మనం ప్రార్థించాలి. ప్రార్థనయంతటిలోనూ క్రైస్తవ సమాజం గురించి తెలియ జేయబడింది. మరోసారి ఈ వాక్యభాగాన్ని చదవండి. "నేను," "నా" అన్న పదాలు యిందులో కనబడవు. యితరుల గురించిన మనవులతోనే ఈ ప్రార్థన నేర్పబడింది.

## తగ్గింపు స్వభావమందు మాదిరి (6:12)

ఈ ప్రార్థనలో తరువాతి మనవి కూడ వ్యక్తిగతమైనదే: "మా ఋణములు క్షమించుము" (12ఎ వచనం). "ఋణములు" అన్న మాటకు గల గ్రీకు పదం (*opheilema*) అచ్చియుండుటను సూచిస్తుంది. అయితే ఈ అచ్చియుండడం ఆర్థికపర విషయంలో గాక, ఆత్మీయంగా ఋణపడియుండుటను సూచిస్తుంది. ఈ ఋణము ఎన్నటికీ తీరేది కాదు. క్రొత్త నిబంధనలో, ఈ గ్రీకు పదం యొక్క ఏకవచన రూపం "తప్పు, అపరాధము, పాపము"[16] అను మాటల అర్థాన్నిస్తుంది. "మా పాపములను క్షమించుము" అని లూకా సువార్తలో వ్రాయబడి యున్నది (లూకా 11:4)[17] పరశుద్ధుడైన దేవుని ఎదుట నిలువబడియున్నప్పుడు మనం పాపులమని ఒప్పుకుని మన పాపములను ఆయన ఎదుట ఒప్పుకుంటాము. వాటిని బట్టి మనం దేవుని క్షమాపణ అడుగుతాము – యిది మన హృదయ గర్వాన్ని అణిచివేస్తుంది.

ఈ మనవిలోని రెండవ భాగం మనలోని గర్వాన్ని పూర్తిగా దెబ్బతీస్తుంది: "మా ఋణ స్థులను మేము క్షమించియున్న ప్రకారము" (12 వచనం)[18] క్షమించడం ఎంతో కష్టం.

"క్షమించడం ఎంతో గొప్ప పని అని అందరూ చెబుతారు. కాని వారి స్వానుభవములో అలా చేయలేరు" అని సీ. యస్. లూయూస్ అంటున్నాడు.[19] తప్పు ఎంత పెద్దగా ఉంటె క్షమించడం అంత కష్టంగా ఉంటుంది. యితరులను మనలను కష్టపెట్టినప్పుడు మన అహం దెబ్బతింటుంది. "అతనిని (ఆమెను) ఎన్నడూ క్షమించకూడదు" అని మనం అనుకుంటాం కాని, "యిదేమంత పెద్ద విషయం కాదు. సరిలే వదిలేద్దాం!" అని చెప్పడం ఎంత కష్టం.

"ఎదుటివారు తమ తప్పును ఎరుగకపోతే, లేదా క్షమాపణ అడుగక పోతే నేను వారిని క్షమించగలనా?" అని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. కొంతమంది లూకా 17:3ను చూపిస్తారు. మనం పశ్చాత్తాపం పొందకపోతే దేవుడు మనలను క్షమించడు అన్న విషయాన్ని వారు ప్రస్తావిస్తుంటారు. నేను అన్న అహం మనలో ఉంటుంది. ఏదేమైనా, సహవాస పునరుద్ధరణ గురించి నేను యిప్పుడు మాట్లాడుటలేదు. సిలువలో ఉండగా యేసు శ్రమపొందుతూ "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరేరుగరు గనుక వీరిని క్షమించుమని" చెప్పారు (లూకా 23:34). ఆయన ఈ ప్రార్థన చేసినా గాని, వారు పశ్చాత్తాపపడునంతవరకు వారి జీవితంలో దీని విషయమైన అపరాధ భావన ఉండిపోయింది (అపొస్తలుల కార్యములు 2:36-38ను చూడు). యేసు యొక్క హృదయంలో ఎటువంటి శతృత్వము లేదు అన్న విషయాన్ని గమనించాలి. ఎవరైనా నాకు హాని చేస్తే, తనంతట తానుగా అతను తప్పు చేశానని ఒప్పుకనేంతవరకు మీ యిద్దరి మధ్యనున్న సంబంధం చెడియుంటుంది. అయితే దానికంటె ప్రాముఖ్యముగా, నా హృదయములో చెడు ఉద్దేశం ఉండనేకూడదు నా హృదయంలో ఎటువంటి చేదైన వేరు మొలవకుండ నేను జాగ్రత్తపడాలి (హెబ్రీయులకు 12:15). యిదికాకుండా, నా హృదయం యితరుల యెడల ప్రేమతో నిండియుండుటకు ప్రయాసపడదము. ప్రార్థనలోని ఈ భాగమును లూకా సువార్తలో సకారాత్మక ధోరణిలో చూస్తాము. "మేము మాకచ్చియున్న ప్రతిదానిని క్షమించుచున్నాము గనుక మా పాపములను క్షమించుము" (లూకా 11:4బి).

ఒకవేళ మనం క్షమించలేక పోయినట్లయితే, మొదటిగా, యిది మన ప్రస్తుతపు సంతోషాన్ని హరించివేస్తుంది. కౌన్సిలర్ లారీ కాల్విన్ ఈలాగు వ్రాస్తున్నారు, "చేదు మన ఆత్మను తినివేస్తుంది. మన శక్తిని క్షిణింపచేస్తుంది. మన వ్యక్తిత్వాన్ని పాడుచేస్తుంది. నిద్రను లేకుండా చేస్తుంది. ఆఖరికి మన ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. మనసులో పగ పెట్టుకోవడం ద్వారా, ముఖం ముడతలు పడుతుంది, భుజాలు జారిపోతాయి, కడుపులో మంటపుడుతుంది, పెదవులు పగిలిపోతాయి."[20]

రెండవదిగా, మరియు ప్రాధానంగా, మనలో క్షమించలేని తత్వం నిత్య ఆనందాన్ని లేకుండా చేస్తుంది. మాదిరికర ప్రార్థన తరువాత ప్రభువు చెప్పిన ఈ మాటలను గమనించండి. "మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" (మత్తయి 6:14, 15). యితరులను క్షమించలేని వ్యక్తి తాను దాటవలసిన వంతెనను తన చేతులతో తానే నాశనం చేసుకున్నట్లు అని లోకంలో ఒక మాట.

## పరిజ్ఞానమందు మాదిరి (6:13ఎ)

"మమ్మును శోధనలోనికి తేక దుష్టుని నుండి తప్పించుము" (13ఎ వచనం; లూకా 11:4 చూడు) అన్న మాటలతో ఈ ప్రార్థన కొనసాగింపబడింది. "శోధన" (*peirasmos*) అన్న పదమునకు వాడబడిన గ్రీకు పదానికి ఎన్నో రకాల అర్థాలున్నాయి. కాని యిక్కడ ఈ వచనంలో యిది "దుష్టత్వము" అను పదమునకు ప్రత్యామ్నాయంగా వాడబడింది. దీని నేపథ్యాన్ని గమనిస్తే, "తప్పు చేయుటకు ప్రేరేపించే శోధనను" యిది సూచిస్తుంది. ప్రభువు తన శిష్యులకు నేర్పిన ఈ ప్రార్థన తనలోని పరిజ్ఞానమందు మాదిరితనాన్ని చూపిస్తుంది. ఎందుకంటె, యిది పాపక్షమాపణ గురించి మాత్రమే గాక పాపమును కలుగజేసే వాటినన్నిటినుండి దూరంగా ఉండుటకు యిది బోధిస్తుంది.

గ్రీకు ప్రతులలో "దుష్టత్వము" అన్న పదమునకు ముందు "ది" అన్న ఉప పదం ఉంది, దీనికి "దుష్టత్వము" లేదా "దుష్టుడు" అని అర్థము.[21] ప్రతి దుష్టత్వమునకు (పాపమునకు) మూలము దుష్టుడే కాబట్టి సందర్భానుసారంగా దేనినయినా తీసుకోవచ్చు.

శోధనకు దూరంగా ఉండుటకు దేవుని యొక్క సహాయం తీసుకోవాలని ఈ విన్నపం తెలియజేస్తుంది.[22] మన జీవితంలోని శోధనలను ఎదుర్కొనడానికి, సాతానును ఎదురించడానికి మనం దేవుని సహాయాన్ని అడగాలి. యిది మన జీవితంలో బాధ్యతను పెంచుతుంది. మనం కొన్నిసార్లు కళ్ళు తెరచి ఎరిగియుండి కూడ శోధనలో పడి అక్కడినుండి తప్పించుమని దేవుని సహాయాన్ని కోరుతుంటాము. మనం శోధనలో పడతామని ఎరిగియుండి కూడ "శోధన నుండి మమ్మును తప్పింపుము" అన్న ప్రార్థనను మనం చేయలేము.

## స్తుతియందు మాదిరి (6:13బి)

"[ఎందుకనగా రాజ్యము, శక్తి, మహిమ నిరంతరము నీవైయున్నవి, ఆమేన్]" (13 వచనం) అన్న చివరి మాటలు NASBలో బ్రాకట్‌లో పొందుపరచియున్నాయి. ఈ మాటలు ప్రాచీన ప్రతులలో కనబడవు. మొదటి శతాబ్దపు కాలంలోని సంఘాల్లో ఈ మాటలు ప్రార్థన అంతములో వాడబడియున్నాయనుటకు రుజువు ఉంది. ఈ మాటలు యిప్పటి అనేక రకాల బైబిలు వర్శన్లలో చివరి లేదా మార్జిను తరువాత గాని పేర్కొనబడియుంటాయి. వీటిలో ప్రార్థన ముగించబడడం ద్వారా ప్రార్థనకు ఇవి సరిగ్గా అతకబడి యున్నట్లు ఉంది. సమస్త మేలులకు మూలమైన దేవుని సంబోధనలోనే ఈ ప్రార్థన ముగించబడుతుంది:

- "రాజ్యము" ఆయనది. రాజ్యము ఆయనకు చెందినది. ఆయన సమస్తము పై అధికారి – దీనిని మనం అంగీకరించాలి.
- "శక్తి" ఆయనది. ఈ లోక బలవంతులకంటె ఆయన సర్వశక్తిమంతుడు. దీన్ని మనం గుర్తించాలి.
- "మహిమ" ఆయనది – దీనిని మనం ప్రకటించాలి.
- "నిరంతరము" యిది సత్యము. ఆమేన్!

## ముగింపు

ఇదే మాదిరి ప్రార్థన. ప్రార్థనను గురించిన ప్రతి విషయాన్ని యిది తెలియజేస్తుందా? లేదు. ఉదాహరణకు, యిది యేసు నామములో ప్రార్థించాలన్న విషయాన్నే తెలియజేయడం లేదు.

మోషే ధర్మశాస్త్రం యొక్క అధికారం ఇంకనూ ఉన్న సమయంలో ఈ ప్రార్థన చెప్పబడింది. ఈ దినాన ఏ యూదుడైనా ఈ ప్రార్థనను ఉపయోగించవచ్చు. నూతన నిబంధన ప్రజలముగా, *"ప్రతి విషయమునకు ప్రభువైన యేసు క్రీస్తునందు మనం దేవునికి*[23] *కృతజ్ఞతాస్తుతులు"* చెల్లింపబద్ధులమైయున్నాము (ఎఫెసీయులకు 5:20 [నొక్కి చెప్పింది నాది]; యోహాను 16:24 మరియు కొలొస్సయులకు 3:17 చూడు) అని పౌలు బోధిస్తున్నాడు. మాదిరి ప్రార్థనలో ప్రార్థనా విన్నపములు సాధారణమైనవి. సాధారణ ప్రార్థనలకు ఒక సమయం, సందర్భం ఉన్నాయి. కాని, నియమం ప్రకారం మన విన్నపములు ఖచ్చితంగా ఉండాలి. ప్రత్యేక ఆశీర్వాదములకై దేవునికి వందనములు చేయాలి. కొన్ని ఖచ్చతమైన పాపములను ఒప్పుకోవాలి. కొంతమంది కొరకు ప్రార్థంచాలి (కొలొస్సయులకు 1:3; 1 థెస్సలొనీకయులకు 1:2, 3; 2 థెస్సలొనీకయులకు 2:13; యాకోబు 5:16 చూడు). ఇవిగాకుండ మాదిరి ప్రార్థన నుండి మనమెన్నో విషయాలను నేర్చుకొనవచ్చు. ముందుగానే చెప్పుకున్న ప్రకారం, దీనీయందలి గమనంలో, భక్తిలో, నొక్కి చెప్పుటలో, నిర్బంధములో తగ్గింపు స్వభావంలో, పరిజ్ఞానములో, స్తుతిలో యిది మాదిరి.

ముగించబోవుతుండగా, మన ప్రార్థన "పరలోకమందున్న మా తండ్రీ" అని ప్రారంభవుతుందని గుర్తు చేస్తున్నాను (9 వచనం). దేవుడు నీకు తండ్రిగాకుండా ఈ ప్రార్థనను చేయలేరు. ఆయన మీకు తండ్రేనా? మీరాయన కుమారులేనా? విశ్వాసము మరియు విధేయత ద్వారా మీరాయన కుటుంబంలో జన్మించారా? "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులైయున్నారు" (గలతీయులకు 3:26). "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" (27 వచనం) అని పౌలు వ్రాస్నున్నాడు. పశ్చాత్తాపం పొందిన విశ్వాసిగా బాప్తిస్మం తీసుకున్న తరువాత దేవుని కుమారునిగా మీరు ఎప్పుడయినా ప్రవర్తించారా? లేక ఆయన కుటుంబమైన సంఘానికి నింద వచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారా? (1 తిమోతి 3:15). మీరు బాప్తిస్మము పొందదలిస్తే లేక సమాధానపడవలెననుకుంటే (గలతీయులకు 6:1; అపొస్తలుల కార్యములు 8:22; యాకోబు 5:16) నేడే ఆ పని చేయులాగున నేను ప్రార్థిస్తున్నాను.

---

సూచనలు

[1]ట్రూత్ ఫర్ టుడే 2002 డిశంబర్ సంచికలోని "మాదిరి ప్రార్థన" అనే ప్రసంగం యొక్క సవరణ యిది. [2]"కాబట్టి" అను మాట ఈ ప్రార్థనకు, దీని ముందున్న మాటకు సంబంధాన్ని కలిపియుంచుతుంది. వ్యర్థమైన మాటలను మనం ఉపయోగించకూడదు (మత్తయి 6:7) కానీ, "ఈలాగు ప్రార్థన" చేయాలి. [3]NASBలో 68 పదాలున్నాయు. ఆఖరి భాగం 13వ వచనంలో చేర్చబడింది. KJVలో అయితే మత్తయి కథనానికి 66 పదాలున్నాయి. గ్రీకు ప్రతులలో 13వ వచనం గాక 58 పదాలున్నాయి. [4]NASBలో యిలా ఉంది. KJVలో లూకా కథనంలో 58 పదాలుండగా గ్రీకు ప్రతులలో 38 పదాలున్నాయి. [5]నిజమైన "ప్రభువు ప్రార్థన" యోహాను 17లో ఉందని చెబుతారు. [6]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons, Ltd., 1971), 3. [7]D. Martyn Lloyd-Jones, *Studies in the Sermon on the Mount*, vol. 2 (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1959), 60. Lloyd-Jones నిర్గమకాండము 3:5లో మోషే చెప్పులను విప్పుటను గురించి తెలిపాడు. [8]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 344. [9]నాల్గవ పరిపాలనా కాలంలో రాజ్యము స్థాపించబడుతుందని దానియేలు ప్రవచించాడు. చరిత్ర ప్రకారం ఇది రోమా పరిపాలనా కాలం దానియేలు 2:44 యొక్క వ్యాఖ్యానం కొరకు, David Rechtin and Neale Pryor, "Daniel, 1," *Truth for Today* (May 2001): 13, 14, 34, 35 సంచికను చూడు. [10]J. W. McGarvey, *The New Testa-*

*ment Commentary,* vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., 2006), 64-65.

[11]William Barclay, *The Gospel of Matthew,* vol. 1, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 198-99. [12]"దిన దినము" (*epiousios*) అన్న గ్రీకు పదమునకు వ్యాఖ్యానకర్తలు అనేక అర్థాలనిచ్చారు. మత్తయి 6:11లోని మాటకు "ఈ దినము" అని అర్థం. మరియొక అర్థం "రేపు" అని కూడా వస్తుంది. మన సమీప భవిష్యత్తును గురించి కూడ ఈ దినమే మనం ప్రార్థించాలి. [13]మీరున్న ప్రాంతానికి అనుగుణంగా దీన్ని అన్వయించుకొనండి. [14]D. A. Carson, "Matthew," *The Expositor's Bible Commentary,* vol. 8 (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1984), 171. [15]Maltbie Davenport Babcock, "Give Us This Day Our Daily Bread," *Bartlett's Familiar Quotations,* 12th ed. (Boston: Little, Brown and Company, 1948), 731. [16]*The Analytical Greek Lexicon*, 296. మరో తర్జుమాలో యిది అపరాధముగా ఇయ్యబడింది. (ఇది పాపమును సూచస్తుంది.) "మా యెడల అపరాధము చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము." (John Wallace Suter, *The Book of Common Prayer and Administration of the Sacraments and Other Rites and Ceremonies of the Church* [New York: The Church Pension Fund, 1945], 67). [17]లూకా "ఋణములు" మరియు "అపరాధములు" అన్న రెండు పదములను పర్యాయ పదాలుగా వాడాడు. [18]మత్తయి 18:23-35తో ఈ వాక్య భాగాన్ని పోల్చండి. [19]"English Literature: C. S. Lewis" (http://www.anglik.net/lewis.htm; Internet; accessed 13 June 2008). [20]Larry Calvin, *The Power Zone* (Fort Worth: Sweet Publishing, 1995), 95.

[21]"దుష్టుడు" అని NKJVలో వ్రాయబడింది. [22]దేవుడు ఎవరినీ శోధింపడు (యాకోబు 1:13) గనుక "శోధనలోనికి తేక" అను మాటకు, "మేము శోధనలోకి నడిపించబడకుండునట్లు సహాయం చేయుము" అనే భావమును ఇవ్వవచ్చు. [23]"యేసు నామములో" అను మాట వాడుకగా కాక ప్రభువుని మధ్యవర్తిగా గుర్తించి మనం చెప్పే మాట యిది (1 తిమోతి 2:5).